# పక్కా గృహానికి తోడుగా డ్వాక్రా రుణం


కొమ్ముచిక్కాలలో జగనన్న లే అవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు

- లబ్ధిదారులకు రూ.35 వేలు రుణం అందజేత
- చురుగ్గా సాగుతున్న పక్కా ఇంటి నిర్మాణాలు

| మండలం | మంజూరైన పక్కా ఇళ్లు | పూర్తయిన గృహాలు | పురోగతిలో ఉన్నవి | ప్రారంభించాల్సిన ఇళ్లు | డ్వాక్రా రుణం పొందిన వారు |
|---|---|---|---|---|---|
| పాలకొల్లు | 1549 | 788 | 540 | 221 | 986 |
| పాలకొల్లు టౌన్ | 2701 | 161 | 2365 | 175 | 276 |
| యలమంచిలి | 3055 | 1259 | 1652 | 144 | 2639 |
| పోడూరు | 1420 | 476 | 926 | 18 | 1326 |

పాలకొల్లు అర్బన్: ప్రతీ పేదవాడు సొంతింట్లో ఉండాలని ఆశపడతాడు. ప్రజాసంకల్ప యాత్ర సమయంలో ఈ విషయాన్ని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాలు భూమిని సేకరించి అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి పట్టాలిచ్చారు. అలాగే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షల సాయం అందిస్తున్నాయి. దీనికి తోడు పక్కా గృహం మంజూరైన డ్వాక్రా మహిళలకు బ్యాంక్ నుంచి రూ.35 వేలు రుణం కూడా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు చురుగ్గా చేసుకుంటున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం జగనన్న లే అవుట్‌లలో అవసరమైన నీరు ఏర్పాటు చేయడానికి బోర్లు ఏర్పాటు చేశారు. అలాగే రవాణా సౌకర్యం మెరుగుపరచడం కోసం రోడ్లు నిర్మించారు. గత ఆరు నెలలుగా వర్షాభావ పరిస్థితులు కారణంగా ఇంటి నిర్మాణాల్లో వేగం తగ్గింది. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. బిల్లులు కూడా సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమకావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గృహ నిర్మాణాల బిల్లులు మూడు దఫాలుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. అలాగే ఉపాధి హామీ పథకం నుంచి రూ.30 వేలు లబ్ధిదారుడికి అందుతున్నాయి. దీంతోపాటు బ్యాంక్ నుంచి ప్రతీ లబ్ధిదారునికి రూ.35 వేలు రుణంగా అందిస్తున్నారు. ఈ నిధులకు తోడు లబ్ధిదారులు సొంత నగదు కొంత జమ చేసుకుని పక్కా గృహం నిర్మించుకుంటున్నారు. ఇంటి పట్టాతో పాటు గృహ నిర్మాణశాఖ ద్వారా రుణం అందించి, బ్యాంక్ ద్వారా వాయిదాల పద్ధతిలో చెల్లించుకునే విధంగా రూ.35 వేలు రుణ సౌకర్యం అందించడం లబ్ధిదారులకు ఎంతో వెసులుబాటు కల్పించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### రూ.35 వేలు రుణం తీసుకున్నా


నాకు కాపవరంలో జగనన్న లే అవుట్‌లో ఇంటి స్థలం వచ్చింది. గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షలు రుణం మంజూరైంది. ఇంటి నిర్మాణం కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీకి తీసుకుంటే భారం అవుతుంది. సులభ వాయిదాలపై నెలవారీ చెల్లించే విధంగా లంకలకోడేరు బ్యాంక్ నుంచి రూ.35 వేలు తీసుకున్నాను. దీంతో ఇంటి నిర్మాణ పని కొంత ముందుకు సాగింది.

– ఆకుమర్తి ప్రశాంతి, కాపవరం

### జూన్ నాటికి ఇంటి నిర్మాణం పూర్తి


నాకు ఇంటి స్థలం పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకుంటున్నాను. ప్రస్తుతం స్లాబ్ ఎత్తుకి పిల్లరు కట్టుకున్నాను. త్వరలో స్లాబు వేసుకోవడానికి పనులు చేసుకుంటున్నాను. బ్యాంక్ నుంచి సులభ వాయిదాలపై చెల్లించుకునే విధంగా రూ.35 వేలు రుణం ఇచ్చారు. జూన్ నాటికి గృహం పూర్తి చేసుకుంటాం. అద్దె ఇంటిలో ఉంటున్న మాకు స్థలం ఇవ్వడంతో పక్కా గృహాన్ని నిర్మించుకుంటున్నాం. ఎంతో ఆనందంగా ఉంది.

– గుండుబోయిన మంగతాయారు, లంకలకోడేరు

### సొంత స్థలంలో ఇంటి నిర్మాణం


గ్రామంలోని మెయిన్ సెంటర్‌లో మాకు సొంత ఇంటి స్థలం ఉంది. ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షలు సాయం చేశారు. దీనికి తోడు బ్యాంక్ రుణం రూ.35వేలు ఇచ్చారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. గృహ ప్రవేశం కూడా అయ్యింది. సులభ వాయిదాల్లో రుణం చెల్లిస్తున్నాను.

– కొమ్మాను లక్ష్మీ మాణిక్యం
శివదేవునిచిక్కాల

## క్లుప్తంగా

### బాధ్యతతో పదవులు నిర్వహించాలి


ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును కలిసి కతజ్ఞతలు చెపుతున్న సుమన్

నరసాపురం: పదవులు పొందిన వారు పార్టీ కోసం బాధ్యతగా పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ నియమితులైన బుడితి సుమన్ శుక్రవారం ముదునూరిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రజల అవసరాలు, సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే అంశంలోను కొత్తగా పార్టీ బాధ్యతలు తీసుకున్న వారు ఉత్సాహంగా పని చేయాలని చెప్పారు. సమీపంలోనే ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉన్నందున కీలకంగా పని చేయాలని సూచించారు.

### ముమ్మరంగా చెరువు తవ్వకం పనులు


చెరువు తవ్వకం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆనంద్ కుమార్

మొగల్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొగల్తూరులో బోదె చెరువు తవ్వకం పనులను అమృత్ సరోవర్ పథకంలో రూ 2.72 లక్షలతో చేపట్టారు. శుక్రవారం ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్ కుమార్ చెరువు తవ్వకం పనులు పరిశీలించారు. త్వరలో మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులను కూడా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

### ఘనంగా రామాలయం పునఃప్రతిష్టాపనోత్సవాలు


విగ్రహాల ప్రతిష్ట పూజలు నిర్వహిస్తోన్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో 120 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీ కోదండ రామాలయం పున ప్రతిష్టాపన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఎన్‌ఆర్‌ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, శిరీష దంపతుల ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దింటి అనిల్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీ పరిపూర్ణానంద స్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చేగొండి రామకృష్ణ, పాలంకి వరప్రసాద్, కోటిపల్లి ఆనందరావు, నంద్యాల బాబు, కోటిపల్లి దొరయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### స్వర్ణాంధ్రలో సంయుక్త్ 2కె23 ఫెస్ట్


సంయుక్త్ 2కె23 ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సాంకేతిక విద్యను అభ్యసించే ప్రతీ ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో విద్యాభ్యాసం పూర్తి చేసి సమాజంలో ఉన్నతులుగా తయారవ్వాలని డీఎస్పీ రవిమనోహరాచారి, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలల చైర్మన్ కేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన సంయుక్త్2కె23 ఫెస్ట్ ప్రారంభ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. టెలికం సబ్‌డివిజనల్ ఇంజనీర్ చింతపల్లి రాజాబాబు, ట్రెజరర్ కేవీ స్వామి, అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.పండరీనాథ్, విభాగాదిపతులు ఫెస్ట్ కన్వీనర్ బి.యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

### 18న లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఈ నెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఉషా లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో మాట్లాడుతూ ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో ఫ్యామిలీ, కన్జ్యూమర్స్, ఐపీఆర్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి, ఏపీపీ జయసింధు పాల్గొన్నారు.

### జాతీయ సమైక్యతా శిబిరం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తోన్న సబ్‌కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: వైఎన్ కళాశాలలో వారంరోజుల పాటు జరిగనున్న జాతీయ సమైక్యతా శిబిరం శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. శిబిరాన్ని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీప భవిష్యత్‌లో ఇండియా సూపర్ పవర్‌గా మారబోతుందని అన్నారు. భారత్ అభివృద్ధిలో యువత ముఖ్య భూమిక పోషించనుందని వివరించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినంధనీయమన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ మాట్లాడుతూ భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ సేవా పథకం ప్రాంతీయ కన్వీనర్, వైఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.. జాతీయ సేవా పథకం ప్రాంతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 212 మంది విద్యార్థులు, జాతీయసేవా పథకం ప్రోగ్రాంఆఫీసర్లు శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ (అమరావతి) డాక్టర్ పి.అశోక్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ యువజన శాఖాధికారి సైదా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు, పీజీకోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఎస్ చింతారావు పాల్గొన్నారు.

## కాళీపట్నం పాతపాడు రోడ్డుకు మోక్షం


కాళీపట్నంలో రోడ్డు తవ్వకం పనులు పరిశీలిస్తున్న పార్టీ నాయకులు

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పాతపాడు వయా జగన్నాథపురం ప్రధాన రహదారికి మోక్షం కలిగింది. కాళీపట్నం తూర్పు పడమర గ్రామాలను కలుపుతూ కాళీపట్నం కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి దాని స్థానంలో నూతన వంతెనను నిర్మించి కాళీపట్నం పడమర పాతపాడ వయా జగన్నాథపురం వరుకు రహదారి నిర్మాణాకి ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. దీంతో గతేడాది నవంబర్‌లో నాయకులు శంకుస్థాపన చేశారు. అయితే ఇటీవలే పరిపాలనా అనుమతులు రావడంతో కాళీపట్నం పడమరలో రొడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, పిచ్చి మొక్కలు తొలగించే పనులు చేపట్టారు. శుక్రవారం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కవురు సుబ్రమణ్యం, దొంగ నాగముని,కవురు ఏడుకొండలు,జక్కంశెట్టి ఏడుకొండలు, కవురు సత్యనారాయణ తదితరులు పనులును పరిశీలించారు.

## సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు


అరట్లకట్టలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి షేక్ అబ్దుర్ రహీం

పాలకొల్లు అర్బన్: దాళ్వా సాగులో వంతలు వారీ విధానం అమలు చేస్తున్నామని, రైతులు సాగునీటి సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత గ్రామ కమిటీలకు తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం అన్నారు. మండలంలోని తిల్లపూడి, అరట్లకట్ట గ్రామాల్లో శుక్రవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం కాండం తొలుచు పురుగు వరిపైరును ఆశిస్తుందని, దీని నివారణకు ఎసిఫెట్ 1.5 గ్రాములు లీటరు నీటిలోనూ, లేదా క్లోరాంతరపోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అరట్లకట్ట, తిల్లపూడి గ్రామ సర్పంచ్‌లు రుద్రరాజు శ్రీనివాసరాజు (వాసురాజు), నడపన శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

### హెల్మెట్‌ధారణపై అవగాహన


హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న పట్టణ సీఐ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పట్టణ సీఐ దారావతు రాంబాబు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్ వద్ద హెల్మెట్ లేని వాహనదారులను ఆపి ఫైన్‌లు వేయకుండా తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ రాంబాబు మాట్లాడుతూ మోటర్ వాహనాలపై హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా ప్రయాణం చేయడంవల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఎస్సై ఎస్.ముత్యాలరావు, ట్రాఫిక్ ఏఎస్సై కృష్ణమూర్తి, సీసీ నాయుడు పాల్గొన్నారు.

### రైతులకు అండగా ములపర్రు సొసైటీ


ములపర్రు సొసైటీలో రుణాలు అందిస్తున్న ఛైర్ పర్సన్ యాండ్ర మంగాదేవి

పెనుగొండ: మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో ములపర్రు హిందూ ముస్లి వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని రైతులకు రుణాలు అందించి అండగా నిలుస్తున్నట్లు సొసైటీ చైర్ పర్సన్ యాండ్ర మంగాదేవి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సొసైటీ వద్ద రైతులకు రూ.16,02,450 విలువైన రుణాలు అందించారు. రానున్న రోజుల్లో మరింత మంది రైతులకు రుణాలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు కొల్లాటి అబ్బులు, వైఎస్సార్ సీపీ నాయకులు యాండ్ర శ్రీనివాస్, రైతులు మొనవర్తి జానకి దేవి, కడలి రామారావు, గుండాల నాగేశ్వరరావు, పంది పుష్పవతి, యు.సీతామహాలక్ష్మీ పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ప్రధాన ఎజెండా

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


సిద్ధాంతంలో లబ్ధిదారులకు సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ఎజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం సిద్ధాంతంలో అరుంధతి పేట, కృష్ణానందపురం, చెరువుపేట, లంకపేటల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించి లబ్ధిదారులకు అందించిన సంక్షేమాన్ని వివరించి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో పేదలందరికీ రూ.2 లక్షల కోట్లుకు పైగా సంక్షేమాన్ని అందించారన్నారు. అదే విధంగా పరిశ్రమల స్థాపనకు రాష్ట్రాన్ని అనువుగా మార్చి అభివృద్ధి పథంలో పరిగెట్టిస్తున్నారన్నారు. గతంలో రాష్ట్రంలో ఏ పనులు జరగాలన్నా జన్మభూమి కమిటీలు అవినీతి మయంగా చేసారన్నారు. నేడు అర్హతే ప్రామాణికంగా పారదర్శక పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతికి తావివ్వకుండా పాలన సాగిస్తున్నారన్నారు. అయితే, చంద్రబాబు రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఎన్ని కుటిలయత్నాలు చేసినా ప్రజలు అందరూ సీఎం జగన్‌కు అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), యర్రంశెట్టి బుజ్జి, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు చిన్నం ఏడుకొండలు, గుత్తుల సత్యవతి, షేక్ రిజ్వానా, సొసైటీ అధ్యక్షులు బలువు కృష్ణమూర్తి, కేశవరపు గణపతి, యాండ్ర వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, బాలం సత్తిరాజు, సాకా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### పందులు, పశువులను రోడ్లపైకి వదలొద్దు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడతూ యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని చెప్పారు.

### ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

పెనుగొండ: ఏపీటీఎఫ్ పెనుగొండ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాదరావు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం పెనుగొండలో నిర్వహించిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, అధ్యక్షుడిగా పీవీ రాఘవులు, ఉపాధ్యక్షులుగా సీహెచ్‌వీకే సూర్యనారాయణ, బి.కుమార్, జీ శ్రీరాం బాలాజీ, కె.సమత, బి.లీలాశుకుడు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

### హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందజేత

పాలకొల్లు సెంట్రల్: నిర్భాగ్యులకు సహాయం చేయడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని దాత కామిశెట్టి అయ్యప్ప నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు మానవత సేవా సంస్థ ద్వారా పౌష్టికాహారం అందజేశారు. రూ. 8 వేలు విలువ చేసే పౌష్టికాహారాన్ని 20 మంది హెచ్‌ఐవి బాధిత చిన్నారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, ముత్యాల రామారావు, ధనాని సూర్యప్రకాష్, బి.రమాకాంత్, ముత్యాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

### నిష్పక్షపాతంగా ఆడిట్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ 2021–22 రికార్డుల ఆడిట్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిటర్ వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా రికార్డుల పరిశీలిస్తామన్నారు. నెలరోజులపాటు ఆడిట్ ఉంటుందని, మే 1 నాటికి రిపోర్ట్ అందుతుందని తెలిపారు. ప్రధాన ఆడిటర్ అబ్రహ్మం ఆధ్వర్యంలో ఐదుగురు సిబ్బందితో రికార్డులను తనిఖీ చేసున్నా మన్నారు. నగర పంచాయతీ ఏర్పడిన తరువాత ఆదాయం పెరగలేదన్నారు. చింతలపూడి, ఆకివీడు పంచాయతీలు ఒకేసారి నగర పంచాయతీగా ఏర్పడ్డాయని, అయితే చింతలపూడి నగర పంచాయతీ ఆదాయం రూ.5 కోట్లు పైబడిఉందని, ఆకివీడు నగరపంచాయతీ ఆదాయం కేవలం రూ.1.50 కోట్లకు మించలేదని అన్నారు.

### శ్రీ ఉమా సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం


దిగమర్రులోని శ్రీ ఉమా సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన దిగమర్రులోని శ్రీ ఉమా సోమేశ్వరస్వామి, శ్రీ పార్వతీ అమ్మవార్ల కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చక స్వాములు చేబ్రోలు బాలకృష్ణ గాంధీ, చేబ్రోలు శ్రీనివాసరామమూర్తి బ్రహ్మత్వంలో గ్రామపెద్దలు కారుమూరి గాంధీబాబు – లక్ష్మీకనకదుర్గ దంపతులతో శ్రీ ఉమా సోమేశ్వరస్వామి, శ్రీ పార్వతీదేవి, శ్రీ కుమారస్వామి, శ్రీ వల్లీదేవసేన దేవేరులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఉత్సాహంగా రథోత్సవం


పెనుగొండలో జనార్ధుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: క్షేత్ర పాలకుడు జనార్ధన స్వామి రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ దేవి భూదేవి సమేత జనార్ధన స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ మేడపాటి చిరంజీవిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి, కార్యనిర్వహణాధికారి పి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

## వైభవంగా కనకదుర్గమ్మ కల్యాణం


కనకదుర్గా మల్లేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి యావని వేంకట రామచంద్ర సోమయాజులు (ఘనాపాటి) ఆచార్యత్వంలో నిట్టల శ్రీనివాసు బ్రహ్మత్వంలో ఇరగవరం వేద పండితులచే ఎదురు సన్నాహ ఉత్సవం అనంతరం దాసరిరెడ్డి శ్రీనివాసరావు, కుమార శ్రీవరలక్ష్మి దంపతులతో అమ్మవారి కల్యాణం జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు కుంకుమ భరిణెలు, ప్రసాదం పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

### గ్యాస్ ధరల పెంపుపై నిరసన

పెనుగొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు సిర్రా నర్సింహమూర్తి, పి.మోహనరావులు అన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరశిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సంతమార్కెట్ వీధి, రామేశ్వర స్వామి సత్రం మీదుగా ఆచంట కచేరీ సెంటర్ వరకూ గ్యాస్ బండలు నెత్తిన మోస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ శర్మ, వద్ది పర్తి అంజిబాబు, ఇంజేటి వీరయ్య, తోటపల్లి సత్యనారాయణ, ఇందుకూరి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం

మొగల్తూరు: తమ కుమార్తె కనిపించడంలేదంటూ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం ముత్యాలపల్లి పంచాయతీ చింతరేవుకు చెందిన వివాహిత గత రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కలా, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి మోకా సత్యనారాయణ పోలీసులను ఆశ్రయించాడు.

### నిత్యాన్నదానానికి విరాళం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యం ఏర్పాటు చేస్తున్న అన్నదానం నిమిత్తం పట్టణానికి చెందిన దాత కంచర్ల శ్యామ్ చందు రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఆలయంలో ఏర్పాటుచేసే నిత్యాన్నదానానికి భక్తుల సహకారం మరువలేనిదని ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దాతను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయ సూపరింటెండెంట్ మెండెం స్వామి పాల్గొన్నారు.